కలెక్టరేట్ సుందరీకరణకు చర్యలు

కలెక్టరేట్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ సృజన

-కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్ సుందరీకరణకు చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా అన్ని శాఖల కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని పలు శాఖల కార్యాలయాలను మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, డిఆర్ఓ నాగేశ్వరరావుతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భోజనం చేసిన ప్లేట్లు, కాఫీ కప్పులు కార్యాలయ పరిసరాల్లోనే పడేసి చెత్తా చెదారంతో అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. కారిడార్లలో వేలాడుతున్న విద్యుత్ తీగలను, ఇంటర్నెట్ వైర్లను ఒక పైప్ లైన్‌లో అమర్చాలని కలెక్టర్ సూచించారు. భవనాలు మొత్తం వాటర్ ప్రూపింగ్ చేయిస్తామని, స్లాబ్స్ కూడా మరమ్మతులు చేయిస్తామన్నారు. అన్ని ఫ్లోర్లలో కారిడార్లు మరమ్మతులు చేసి ఆధునీకరిస్తామన్నారు. వాష్ రూమ్స్ మరమ్మతులు చేయించి బాగు చేస్తామన్నారు. కార్యాలయ ఆవరణలో ల్యాండ్ స్కేపింగ్, పార్కులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఆటోలను గేటు వద్దనే నియంత్రించేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్లో ఉన్న లిఫ్ట్‌ను తయారు చేయించాలని, వికలాంగుల శాఖ కార్యాలయంలో ఉన్న ర్యాంపును బాగు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అన్ని పంటలకు

బీమా వర్తింపజేయాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం పునరా ఆలోచన చేసి అన్ని పంటలకు బీమా సౌకర్యం కల్పించి రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పంటల దిగుబడిలో ఎగుడుదిగుడులుగా ఉన్నాయన్నారు. దిగుబడి సక్రమంగా రాక రైతులు మనోవేదన చెందుతున్నారని తెలపారు. కార్మిక కర్షక భవన్‌లో జరిగిన ఎపి రైతు సంఘం జిల్లా ముఖ్య నాయకులతో సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వెంకటేషులు అధ్యక్షత వహించారు. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం పత్తి, టమేటా, ఉల్లి, మొక్కజొన్న, మిరప లాంటి పంటలు బాగా దెబ్బతిన్నాయన్నారు. దిగుబడి రాలేదని కొన్ని పంటలకు ప్రభుత్వం నీటిపారుదల ఉన్నటువంటి వాటికి మాత్రమే బీమా సౌకర్యం కల్పిస్తానని చెప్పడం సరైనది కాదన్నారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం అనేక రకాల పంటలు వర్షాధారం మీదనే సాగుచేసే పరిస్థితి ఉందన్నారు. తెగుళ్ల వల్ల దెబ్బతిన్న పంటలు ఉన్నాయన్నారు. వర్షాభావం, అధికవర్షం, అకాల వర్షం వల్ల పంటలు దెబ్బతిన్నాయన్నారు. వీటి వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఈ సంవత్సరం మిరప పంటకు రేటు బాగున్నప్పటికీ తెగులు వల్ల పంట దిగుబడి రాలేదన్నారు. ఉల్లి పంట మొత్తం తెగుళ్ల వల్ల దిగుబడి సక్రమంగా లేదన్నారు. మొక్కజొన్నకు పంటకు కత్తెర పురుగు తెగులు వల్ల దిగుబడి బాగా తగ్గిందని, పత్తి పంట నకిలీ విత్తనాలు, వాతావరణం వల్ల దిగుబడి కేవలం ఒకటి రెండు క్వింటాళ్లు మాత్రమే వచ్చిందన్నారు. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి దిగుబడి లేక ఆందోళన చెందుతున్న పరిస్థితి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఉందన్నారు. ప్రభుత్వం పునరా ఆలోచన చేసి అన్ని పంటలకు బీమా సౌకర్యం కల్పించి రైతులను ఆదుకోవాలని ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఇతర సంఘాలను ఐక్యపరిచి పెద్ద ఉద్యమం చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులను అన్ని విధాల ఆదుకుంటానని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మాట నిలుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకష్ణ మాట్లాడుతూ ఒకవైపు అతివృష్టి, అనావష్టి పంటలు పెట్టుబడి ఖర్చులు, నకిలీ విత్తనాల బెడద వంటి వాటితో రైతులు సతమత అవుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. నాలుగు లైన్ల రోడ్లు ,6 లైన్ల రోడ్లు ఇంకారకరకాల పేర్లతో రైతుల భూములను సేకరిస్తున్నారన్నారు. వాటికి తగిన నష్టపరిహారం చెల్లించడం లేదన్నారు. కొత్తగా జిల్లాకు వచ్చిన కలెక్టర్ పునరాలోచన చేసి రైతులకు న్యాయం చేయాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు నాయకులు సి హనుమంతు, పి. హనుమంతు, కె.మల్లయ్య కోటకొండ సూరి, బొల్లవరం కృష్ణ, గార్గేయపురం మృత్యుంజయ పాల్గొన్నారు.

బిజెపిపై ప్రచార భేరి...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రెండో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల, కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తోంది. సామాన్యులపై భారాలు పెంచుతూ నడ్డి విరుస్తోంది. వంట గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతం పెంచేసింది. దాని ఫలితంగా నిత్యావసర సరుకుల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. దీనిపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. బిజెపికి హటావో దేశ్‌కీ బచావో నినాదంలో ఈ నెల 14 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బిజెపి ప్రభుత్వ విధానాలను జోరుగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో, గ్రామాల్లో వామపక్ష నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కరపత్రాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. కర్నూలు నగరంలో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించారు. దేశాన్ని కాపాడుకోవాలంటే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార భేరి కార్యక్రమం ఈ నెల 30 వరకూ కొనసాగనుంది.

వెయ్యి దాటిన యువగళం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర కర్నూలు జిల్లా ఆదోనిలో వెయ్యి కిలోమీటర్ల మైలురాయిని చేరుకుంది. ఈ నెల 13న ఉమ్మడి కర్నూలు జిల్లాలోకి పాదయాత్ర ప్రవేశించింది. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలం, పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలం, ఆలూరు నియోజకవర్గంలోని దేవనకొండ, ఆస్పరి మీదుగా ఆదోని పట్టణం వరకూ పాదయాత్ర సాగింది. పాదయాత్రలో లోకేష్‌ను చూసేందుకు జనం పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.

మండుతున్న ఎండ : జిల్లాలో ఎండ మండుతోంది. మార్చి చివరి వారం నుంచి భానుడి భగభగలు తీవ్రమయ్యాయి. జిల్లాలో వేసవి తీవ్రత పెరిగింది. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమితో మధ్యాహ్నం నిప్పుల కొలిమిలా ఎండ తీవ్రత కనిపిస్తోంది. మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని జిల్లా వాసులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్...

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా వ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ముస్లింలు ఊరేగింపుగా మసీదులకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొత్తబస్టాండు దగ్గర ఈద్గాలో ఖాజి సయ్యద్ సలీంబాష ఖాద్రి, సంతోష్‌నగర్‌లో ముక్తి సయ్యద్ మన్సూర్ అహ్మద్, గడ్డ ఈద్గాలో హాఫీజ్ మన్సూర్ నమాజ్ చదివించారు. వారు మాట్లాడుతూ రంజాన్ పండుగ సర్వ మానవాళి సంరక్షకుడు అల్లాహ్ మహమ్మద్ రసూలుల్లా చూపించిన మార్గంలో నెలరోజులు కఠిన ఉపవాస దీక్షలు భక్తిశ్రద్ధలతో ముగించి రంజాన్ పండుగ వేడుకలు జరుపుతున్నామని తెలిపారు. పండుగ సందర్భంగా సదక్క పిత జగత్ తోఫా వంటి సేవలతో పేదవారికి సహాయపడి ప్రతి ఒక్కరూ పండుగను అల్లా దయవల్ల ఘనంగా జరుపుకున్నామని తెలిపారు. మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరనీయమని తెలిపారు. ప్రతి మానవుడు సర్వ మానవాళి పట్ల ప్రేమ, దయ, సేవాగుణం కలిగి ఉండాలని చెప్పారు. కొత్త బస్టాండు ఈద్గా ప్రార్థనలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ఆయన తండ్రి అహ్మద్ అలీఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి.మోహన్‌రెడ్డి, కర్నూలు డిఎస్‌పి మహేష్ పాల్గొన్నారు. సంతోష్‌నగర్ ఈద్గాదగ్గర టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి టిజి.భరత్ , ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. పండగ సందర్భంగా ఎస్‌డిపిఐ కర్నూలు నగర అధ్యక్షుడు అశ్వక్ హుస్సేన్, కమిటీ సభ్యులు షేక్ అబ్దుల్లా షఫీ అహ్మద్ జలీల్ అహ్మద్ నగర ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. **తుగ్గలి:** తుగ్గలి, రాతన, గిరి గట్ల, రాంపురం కొట్టాల, హుస్సేనాపురం, జొన్నగిరి, కడమ కుంట్లతో పాటు వివిధ గ్రామాలలో రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీరసూల్, మండలకో ఆప్షన్ సభ్యులు చాంద్‌బాషా, కాంగ్రెస్ నాయకులు బొందిమడుగుల, మడుగుల మహబూబ్ బాషా వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు. **మద్దికెర** మండలం ఎడవల్లి మసీదులో రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. పెద్దబాబు సాహెబ్, దివాన్‌వలి, బాషా, హుస్సేన్ సాహెబ్, అసైన్ సాహెబ్ పాల్గొన్నారు.

కర్నూలు కొత్తబస్టాండ్ ఈద్గా వద్ద రోడ్డుపై ప్రార్థనలు పాల్గొన్న ముస్లింలు

రంజాన్ ప్రత్యేకతను వివరిస్తున్న ఖాజి సయ్యద్ సలీంబాష ఖాద్రి

ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ

ధరిత్రి పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ధరిత్రి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని , ప్రిన్సిపాల్ డాక్టర్ వి వి. సుబ్రమణ్య కుమార్ పేర్కొన్నారు. శనివారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ వారి సౌజన్యంతో ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ డైరెక్టర్ ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్రహ్మణ్య కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి, అధ్యాపకులు ఆర్.ఎల్లకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం కూడా పన్ను చెల్లింపు కౌంటర్లు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : ప్రభుత్వం జారీ చేసిన జిఓ ప్రకారం ఆస్తి పన్నులో ఐదు శాతం రిబేటు మినహాయింపు ఈనెల ఆఖరి వరకు ఉన్నందున 23వ తేదీ ఆదివారం కూడా పన్నుల చెల్లింపు కౌంటర్లు తెరిచే ఉంటాయని కర్నూలులో నగర పాలక కమిషనర్ ఎ. భార్గవ్ తేజ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. కౌంటర్లు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తెరవబడి ఉంటాయని పేర్కొన్నారు. కర్నూలు ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్నులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవానికి దేవాలయం ముస్తాబు

ప్రజాశక్తి -తుగ్గలి : తుగ్గలి మండలం పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో వెలిసిన శ్రీపార్వతి పరమేశ్వర కళ్యాణం, రథోత్సవానికి దేవాలయం ముస్తాబ్ చేశారు. శనివారం ఆలయ ధర్మకర్తలు గోపాల్‌రెడ్డి డీలర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 24న సాయంత్రం శ్రీపార్వతీ పరమేశ్వరుల కల్యాణం, సాయంత్రం రథోత్సవం ఘనంగా జరుగుతుందన్నారు. ఇప్పటికే భక్తాదులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. 25న గిరిక ఎడ్ల పందెమును గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. 24న ఉదయం నుండి సాయంత్రం దాకా శ్రీ పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బయట నుండి వచ్చే భక్తులందరికీ అన్ని వసతులు ఏర్పాటు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి ఆశీర్వాదం పొందాలని కోరారు.

రంజాన్ ప్రార్థనలో టిజి భరత్

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

టిడిపి కర్నూలు ఇంచార్జి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ప్రజలందరూ సంతోషంగా ఉండాలని తాను కోరుకున్నట్లు కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ఆయన ముస్లింలతో కలిసి కర్నూలు నగరంలోని సంతోష్ నగర్ కొత్త ఈద్గాలో ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, సోదరులు పాల్గొన్నారు.

పాడైపోయిన పంచాయతీరాజ్ రోడ్లు

పట్టించుకోని అధికారులు..ఇబ్బందుల్లో వాహనదారులు

ప్రజాశక్తి-తుగ్గలి : మండలం పరిధిలోని వివిధ గ్రామాలలో పంచాయతీరాజ్ రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి నుండి పగిడి రాయి, పగిడిరాయి నుండి జొన్నగిరి పంచాయతీరాజ్ రోడ్లు పూర్తిగా సిథిలావస్థకు చేరుకున్నాయి. 15 సంవత్సరాలు క్రితం వేసిన రోడ్లు మట్టి పూర్తిగా లేచి పోయాయి. రోడ్లు ఇంతగా పాడై పోయినా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం విచారకరం. కనీసం ఆరోడ్లకు మరమ్మతులు కూడా చేయడం లేదు. గతంలో డిప్యూటీ సీఎంగా కెఇ. కష్ణమూర్తి ఉన్న సమయంలో పంచాయతీరాజ్ కింద రోడ్లు మంజూరయ్యాయి. అయితే నిధులు లేకనో, అధికారుల నిర్లక్ష్యమో గాని రోడ్లు మాత్రం వేయలేదు. అప్పటినుండి ఇప్పటిదాకా ఆ రోడ్లకు మరమ్మతులు కూడా చేయడం లేదు. గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ నిధులు లేకపోవడంతో రోడ్లు మంజూరు కావడం లేదని అధికారుల సమాధానం ఇస్తున్నారు. కనీసం అక్కడ మరమ్మతులు కూడా చేయకపోవడంతో అధికారులపై ప్రజలు, వాహనదారులు మండిప డుతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ ఆసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ప్రస్తుతం ఆ రోడ్లు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, మంజూరైన మరుక్షణమే ఆ రోడ్లను వేస్తామని తెలిపారు.

ఇది చెరువు కాదు రోడ్డే ?!....

రాజకీయ కక్షతో పొలం రస్తా మూసివేత

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి - రెండవ రోజు కొనసాగిన దీక్షలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పొలానికి రస్తా లేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శకునాల రైతులు ధర్మారెడ్డి , శివారెడ్డి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం ఓర్వకల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద వారు దీక్ష చేపట్టారు. బాధితులు మాట్లాడుతూ శకునాల పొలిమేర సర్వేనెంబర్ 417, 415 లో 17.80 ఎకరాల భూమి మా కుటుంబానికి ఉందని, ఈ భూమి పట్టా భూమి ఈ భూమిలోకి పోవడానికి రికార్డు ప్రకారం రస్తా ఉందని, అయినప్పటికీ అదే సర్వే నంబర్లలో శివపురం పెద్ద పుల్లయ్య, శివపురం చంద్రశేఖర్, రేమట రాజు లు మా ముందు ఉన్నటువంటి రైతులు మా పొలంలోకి రస్తా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా అనేకసార్లు తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా రాజకీయ కక్షతో పలుకుబడితో ఎమ్మెల్యే అనుచరులు రస్తాలో పోనివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. తహశీల్దార్ ఇదిగో అదిగో అంటూ నెలల తరబడి కాలయాపన చేస్తూ సమస్య పరిష్కారం చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా తహశీల్దార్ స్పందించి తగిన చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. ఈ సందర్భంగా శకునాల రైతుల దీక్షలకు ప్రజా సంఘాలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, రైతు సంఘం మండల కార్యదర్శి బి.చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ దేశానికి రైతే రాజు రైతే వెన్నెముక అంటూ గొప్పలు చెప్పుకునే పెద్ద మనుషులు ఈ విధంగా రైతులను రస్తాలో పోనివ్వకుండా రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు రాజకీయాలకు తలొగ్గకుండా రైతులకు న్యాయం చేయాలని శకునాల రైతులు ధర్మారెడ్డి, శివారెడ్డి పొలాలకు రస్తా ఇచ్చేలాగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను పెద్ద ఎత్తున సమీకరించి ఎమ్మార్వో కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చాంద్ బాషా, మనోహర్ పాల్గొన్నారు.

శకునాలలో రస్తాకోసం నిరసనదీక్షలో రైతులు , రైతు సంఘం నాయకులు నాగన్న

వెల్దుర్తి ప్రచార భేరీలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నగేష్, సిపిఐ కృష్ణ , తదితరులు

మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా పోరాటం

వెల్దుర్తి ప్రచార భేరీలో సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-వెల్దుర్తి

మండలంలోని నార్లాపురం, వెంకటాపురం గ్రామాలలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు నగేష్, సిపిఐ మండల కార్యదర్శి కృష్ణ లు మాట్లాడారు. నరేంద్ర మోడీ విదేశాల్లో, సిస్ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి పేద వాడి అకౌంట్ లో రూ.15 లక్షలు వేస్తానని హామీయిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలు దాచుకున్న సొమ్మును బ్యాంకుల నుండి లలిత్‌మోడీ, నీరవ్ మోడీ, విజయ్ మాల్యా లాంటి దొంగలకు అప్పులుగా యిప్పించి భారతీయ బ్యాంకులకు కుచ్చు టోపి పెట్టి విదేశాలకు పారిపోయేలాగా చేశారన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న నరేంద్ర మోడీ ఆయన తీసుకున్న నిర్ణయాల వల్ల దేశంలో ఎన్నడూ లేనంత నిరుద్యోగం పెరిగిందని, నోట్ల రద్దు, జిఎస్‌టి విద్యుత్ సవరణ చట్టం, ఇతర ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాల వల్ల భారతదేశంలో పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు, రైతు ఆత్మహత్యలు, సాంఘిక బహిష్కరణలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వం విషయంలో మెతక వైఖరి అవలంబించడం వల్ల రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరుగుతోందన్నారు. ప్రజలంతా వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలపై ఒత్తిడి తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసేలాగా చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రాజు, సిపిఐ నాయకులు చిలిపి కృష్ణ, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి మండలంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు లైన్ల అభివృద్ధి పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎఇ రాఘవేంద్ర ప్రసాద్ శనివారం తెలిపారు. అల్లు గుండు ఫీడర్ పరిధిలోని అల్లు గుండు, బొమ్మిరెడ్డిపల్లి ,మల్లేపల్లి, నార్లపురం, చెరుకులపాడు ఫీడర్ పరిధిలోని గ్రామాలకు , వెల్దుర్తి టౌన్ ఫీడర్ పరిధిలోని చెరుకులపాడు రహదారి నుండి నార్లాపురం వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందన్నారు. అలాగే అల్లు గుండు , చెరుకులపాడు ఫీడర్ రైతు వినియోగదారులకు 3 ఫేస్ వ్యవసాయ విద్యుత్తు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు , మధ్యాహ్నం 2గంటల నుంచి 6గంటల వరకు ఉంటుందని పరిస్థితిని అర్థం చేస్తుకుని విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.

భానుడి భగభగలు

- రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వేడికి జనం ఉక్కిరిబిక్కిరి

జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత మొదలవుతోంది. ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. జిల్లాలో 42 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత నమోదు అవుతుండంతో ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. ఇంటి నుండి బయటకు వస్తే వడగాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఈ సంవత్సరం వేసవి ప్రారంభం నుండే భానుడు విశ్వరూపం ప్రదర్శిస్తున్నాడు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎండ తీవ్రతతో పాటు వడగాలులు ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎండ వేడిమితో మధ్యాహ్నం నిప్పుల కొలిమిలా ఎండ తీవ్రత కనిపిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని జిల్లా వాసులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి, కలెక్టరేట్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతం, కొండారెడ్డి బురుజు ప్రాంతాలు మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు. ఎండ తీవ్రతతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు ఎండ వేడిమికి ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

శీతల పానీయాలకు గిరాకీ

ఎండలు అధికం కావడంతో ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాల వైపు పరుగులు తీస్తున్నారు. మజ్జిగ, చెరుకు రసం, లస్సి, టెంకాయ నీళ్లు వంటి పెరిగింది. పట్టణంలోని ప్రధాన కూడలిలో చెరుకు రసం, శీతల పానీయాల షాపులు కిటకిటలాడుతున్నాయి. కూలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీలకు డిమాండ్ పెరిగింది. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరగనుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- వైఎస్ఆర్ సర్కిల్‌లో రాస్తారోకో

ప్రజాశక్తి - కోసిగి రూరల్

వైఎస్ఆర్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న మహిళలు

కోసిగిలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కారు. శనివారం కోసిగి వైఎస్ఆర్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టడంతో దాదాపు గంట పాటు భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. టిడిపి ప్రభుత్వంలో తమ కాలనీలో తిక్కారెడ్డి వేసిన తాగునీటి బోరే దిక్కని మహిళలు వాపోయారు. నాలుగేళ్ల వైసిపి ప్రభుత్వంలో కోసిగి బీరప్ప గుడి కాలనీలో తీరని తాగునీటి సమస్యగా మారిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గోడును వినిపించడానికే ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించామని కాలనీ మహిళలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడారు. కోసిగిలోని 9వ వార్డు బీరప్ప గుడి కాలనీలో గత నాలుగేళ్లుగా తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి వేయించిన తాగునీటి బోరే ఇప్పటికీ దిక్కు అయిందని చెప్పారు. నాలుగేళ్ల వైసిపి ప్రభుత్వంలో ఇప్పటివరకు తమ కాలనీలో ఎలాంటి అభివృద్ధి పనులూ జరగలేదని తెలిపారు. తాగడానికి నీరు, సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, పూడికతీత పనులు కూడా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం నాయకులు వస్తారే తప్ప, తమ సమస్యలు తీర్చడానికి మాత్రం ఇంతవరకు తమ కాలనీ వైపు వైసిపి నాయకులు రావడం లేదని మండిపడ్డారు. తమ కాలనీలో రోజూ గంట కూడా తాగునీరు వదలడం లేదని, ఇక తాగునీటి కోసం ఎక్కడికి వెళ్లాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వందలాది వాహనాలు ఇరువైపులా ట్రాఫిక్ జామ్ కావడంతో ఎండవేడిమికి వాహనదారులు, ఇటు బీరప్ప గుడి కాలనీవాసులు అల్లాడిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మహిళలకు సర్ది చెప్పి వారి నీటి సమస్యను తీరుస్తామని అక్కడి నుంచి వారిని వెళ్లగొట్టారు.

వాహనాలను అడ్డుకుంటున్న మహిళలు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు గురుశేఖర్

మతోన్మాద బిజెపిని సాగనంపుదాం

- సిపిఎం, సిపిఐ

ప్రజాశక్తి - నందవరం

ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని ఇంటికి సాగనంపుదామని, అందుకు ప్రజలందరూ సహకారం అవసరమవుతుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.గురుశేఖర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పంపన్న గౌడ్ కోరారు. శనివారం మండలంలోని కనకవీడు గ్రామంలో వామపక్షాల ఆధ్వర్యంలో 5వ రోజు ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో దేశ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలు ఆర్థిక అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, సిపిఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, వృత్తి సంఘాల నాయకులు గోవిందు, దేవపుత్ర, ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్, విజయ్ పాల్గొన్నారు.

దళితుల ఐక్యతను చాటుదాం

- మహనీయుల స్ఫూర్తితో నేడు సామూహిక వివాహాలు

- దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

దళితుల ఐక్యతను చాటుదామని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ వీరేష్ తెలిపారు. దళితుల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుల స్ఫూర్తితోనే ఆదివారం సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని కోరారు. బసవ జయంతి సందర్భంగా ఆదివారం నిర్వహించే సామూహిక వివాహాలతో దళితుల ఐక్యతను చాటుదామని తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహనీయులైన డాక్టర్ బిఆర్.అంబేద్కర్, జ్యోతిరావు పూలే, మానవతావాది బసవేశ్వరుడి జయంత్యుత్సవాల సందర్భంగా వారి స్ఫూర్తితో సామూహిక వివాహాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి దళిత కుటుంబం నుంచి వివాహానికి తరలిరావాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం డిప్యూటీ జిఎస్‌టి కమిషనర్ నాగరాజు, జాతీయ మానవ హక్కుల ప్రధాన కార్యదర్శి మోహన్ రావు, ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్, కర్నాటక రాష్ట్రానికి చెందిన దళిత నాయకులు ఎం.నాగరాజు, కోడ్లే మల్లికార్జున పాటు పలువురు హాజరవుతారని తెలిపారు. నాయకులు లోకేష్, విజయ్, బాలస్వామి, మణికంఠ, విజయ్, సురేష్, సంజీవ్, గిరిమల్లప్ప, ఆనంద్, ఈరన్న, వంశీ, మణి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకుడు వీరేష్

ఎస్టీ రిజర్వేషన్ ఆమోదం పొందేవరకు పోరాటాం

- విఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

పార్లమెంట్‌లో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందే వరకు విఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని రాష్ట్ర అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్ తెలిపారు. శనివారం పట్టణంలోని వాల్మీకి కార్యాలయంలో నాయకులతో కలిసి 'మే 31న చలో ఢిల్లీ' గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ గత మార్చి 24న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేసిందనందుకు ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద వాల్మీకుల సంకల్ప దీక్ష చేపడుతున్నామని చెప్పారు. వాల్మీకులు పార్టీలకతీతంగా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీనియర్ జర్నలిస్టు వెంకన్న, విఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంభీమ్ నాయుడు, వాల్మీకి సంఘం నాయకులు బి.దేవా, సుధాకర్, కిశోర్, బిటి.లక్ష్మన్న, దస్తగిరి నాయుడు, పవన్, సోము పాల్గొన్నారు. **దేవనకొండలో** విఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కప్పట్రాళ్ల మల్లికార్జున ఆధ్వర్యంలో చలో ఢిల్లీ వాల్మీకుల సంకల్ప దీక్ష కరపత్రాలు విడుదల చేశారు. వాల్మీకి నాయకులు రాజన్న, రామాంజనేయులు, రాముడు, రాజు, రాజశేఖర్, జనార్ధన్, మధు, తిరుమలేష్, వాల్మీకులు పాల్గొన్నారు.

ఆదోనిలో గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

దేవనకొండలో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

గుమ్మనూరులో రథోత్సవం, దేవర

- సర్పంచి పచ్చర్లపల్లి లక్ష్మీదేవి

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని గుమ్మనూరు గ్రామంలో బసవేశ్వర స్వామి మహారథోత్సవం, మారెమ్మవ్వ గ్రామ దేవర నిర్వహిస్తున్నట్లు సర్పంచి పచ్చర్లపల్లి లక్ష్మీదేవి, గ్రామ పెద్దలు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 24న సాయంత్రం బసవేశ్వర స్వామి రథోత్సవం, 25న మారెమ్మవ్వకు గంగపూజ, రాత్రి 12 గంటలకు మేటి కుంభం, కుంభోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26న మారెమ్మవ్వ దేవర సందర్భంగా గ్రామస్తులు కుంభోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు జయప్రదం చేయాలని కోరారు.

ఆలయ ప్రాంగణంలో ఉన్న జ్యోషి

శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జ్యోషి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని రాఘవేంద్రుని దర్శించుకున్న కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు సియం జ్యోషి, జ్యోతి ములేమి, హేమలేఖ శనివారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆయనకు శేష వస్త్రం, ఫల మంత్రాక్షతలు, మెమొంటో అందజేసి ఆశీర్వదించారు. దర్శనార్థం మంత్రాలయం చేరుకున్న ఆయనకు ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో తగిన భద్రత కల్పించారు.

భక్తులకు ఆశ్రయం కల్పించిన పీఠాధిపతులు

- ఆరుబయట నిద్రిస్తున్న వారికి వర్షం నుంచి రక్షణ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వర్షం వల్ల ఇబ్బందులు పడుతున్న భక్తులకు ఆశ్రయం కల్పించారు. శుక్రవారం రాత్రి సుమారు 1 గంట సమయంలో వర్షం రావడంతో శ్రీమఠం ఆవరణంలో బయట నిద్రిస్తున్న భక్తులను గమనించిన ఆయన సహృదయంతో శ్రీమఠం వాకిలి తెరిచి లోపలికి ఆహ్వానించారు. శ్రీమఠంలోని మండపంలో నిద్రించేందుకు అవకాశం కల్పించారు. లోపలికి ప్రవేశించిన భక్తులు పీఠాధిపతులకు నమస్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

భక్తులను లోపలికి పంపుతున్న పీఠాధిపతులు

పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంఇఒ లక్ష్మీకాంత్‌రెడ్డి

విద్యార్థులకు చదువే ఆధారం : ఎంఇఒ

ప్రజాశక్తి -పత్తికొండ

విద్యార్థులకు చదివే ఆధారంగా నిలుస్తుందని పత్తికొండ ఎంఇఒ మస్తాన్ వలి ,రిటైర్డ్ ఎంఇఒ లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. పత్తికొండ పట్టణంలోని ఆర్ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను శనివారం ఎంఇఒ మస్తాన్ వలీ ప్రారంభించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు క్రమశిక్షణ విద్య ఎంతో అవసరమని అన్నారు. స్కూల్ యాజమాన్యం ఎంఇఒ మస్తాన్‌వలీకి పూలమాలవేసి శాలువాతో సత్కరించింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, హెచ్‌ఎం కృష్ణ చైతన్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ నెల 24న 'స్పందన'

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 24న సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో 'స్పందన' కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

ఆదోనిలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడును కలిసిన మైనార్టీ నాయకులు

చిప్పగిరిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు ఉదయం 7 గంటల నుంచి ర్యాలీగా వెళ్లి ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో శనివారం రంజాన్ పండగ సందర్భంగా ఈద్ నమాజ్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పట్టణంలోని 60 మసీదుల్లో ఈద్ నమాజ్ నిర్వహించినట్లు పట్టణం ఖతిబ్ సాబ్ జునేద్ హాష్మి తెలిపారు. పట్టణంలోని షాహి జామియా మసీదు, పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్థనలకు వేలాదిమంది ముస్లింలు హాజరయ్యారు. మసీదులో ఖతిబ్ సాబ్ జునేద్ హష్మి ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. నమాజ్ అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి ఇంట్లో ముస్లింలు ప్రత్యేకంగా ఎమ్మెల్యేను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కూడా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ కలిసిమెలిసి ఉండాలని, కులమతాలకు అతీతంగా ఆదోనిలో పండగలు జరుపుకోవడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడును టిడిపి ముస్లిం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. సోదర భావంతో కలిసిమెలిసి జీవించినప్పుడే మతసామరస్యం కాపాడిన వారవుతామని తెలిపారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా డీఎస్పీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో మసీదుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. **చిప్పగిరిలో** రంజాన్ పండగ సందర్భంగా బంబం స్వామి దర్గా దగ్గర ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత గురువు ఖాద్రీ ఉపన్యాసం చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ముస్లింలు మసీదుల దగ్గర ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. **పెద్దకడబూరు** గ్రామంలోని ఈద్గా వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. టిడిపి రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి హాజరయ్యారు. ముస్లిం ఇమామ్ రెహమాన్‌కు టిడిపి నాయకులు రమాకాంత్ రెడ్డి, మల్లికార్జున, మీసేవ ఆంజనేయులు, బాబు శాలువా కప్పి సన్మానించారు. **దేవనకొండ,** తెర్నేకల్, కరివేముల, పి.కోటకొండ, ఎంకె.కొట్టాల, ఐరన్ బండ తదితర గ్రామాల్లో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ముస్లింలు గుంపులుగా ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దానధర్మాలు చేశారు. **కోసిగి (రూరల్)లో** ముస్లింలు రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ముందుగా తమ తమ ఇళ్ల నుంచి, మసీదుల నుంచి ర్యాలీగా బయల్దేరి రైల్వే గేటు పక్కన ఉన్న ఈద్గా వద్ద ప్రార్థనలు చేశారు. మత పెద్ద జాకీర్ మౌలానా రంజాన్ గొప్పదనాన్ని వివరించారు. స్థానికంగా ఉన్న జామియా, నూరాని సున్ని, మదీనా, మజీద్ ఏ అక్సా, ఫారుఖి మసీదుల ముస్లింలు వచ్చి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా నుంచి ఇంటికి వెళ్లే సమయంలో మధ్యలో దానధర్మాలు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **మంత్రాలయం** పాత ఊళ్లో ఉన్న జామీయ మసీదులో పేష్ ఇమామ్ ఖాజా బందేనమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి పురవీధుల గుండా రాఘవేంద్ర సర్కిల్ మీదుగా రాయచూర్ రోడ్డు వైపు ఉన్న ఈద్గా వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాలో స్థలం సరిపోక పక్కనే ఉన్న జాతీయ రహదారి 167పై ఎండలో పిల్లలు, పెద్దలు ప్రార్థనలు చేశారు. రంజాన్ పండగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ముస్లిం మత పెద్దలు గాజుల బాష, సాబ్ జాన్, నూర్ అహ్మద్, ఫక్రుద్దీన్, ఖాజా హుస్సేన్ తాత, నన్నే సాబ్, పింగాణి ఖాజా, సాబువలీ, అక్బర్ వలీ, బాష, రఫీ, చాంద్ పాల్గొన్నారు. **ఆలూరు** మండలంలోని ఆలూరు, మొలగవల్లి, హత్తిబెళగల్, హులేబీడు గ్రామాల్లో రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి ర్యాలీగా వెళ్లి ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **హోళగుందలో** ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండగను జరుపుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి ర్యాలీగా వెళ్లి ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. **కల్లూరు** మండలం పెద్దపాడు గ్రామంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండగను జరుపుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి ర్యాలీగా వెళ్లి ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

దేవనకొండలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కోసిగి ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆలూరులో స్నేహ భావంతో కలుసుకున్న చిన్నారులు

పెద్దపాడులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

ప్రార్థనలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, తదితరులు

భానుడి భగభగ..

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- 43 డిగ్రీలు దాటుతున్న ఎండలు

ప్రజాశక్తి - బనగానపల్లె

భానుడు భగ్గుమంటున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత మొదలవుతోంది. ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. బనగానపల్లె మండలంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. ఇంటి నుండి బయటకు వచ్చేస్తే వడగాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.ఈ సంవత్సరం వేసవి ప్రారంభం నుండే భానుడు విశ్వరూపం ప్రదర్శిస్తున్నాడు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎండ తీవ్రతతో పాటు వడగాలులు ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పట్టణంలో రద్దీగా ఉండే పెట్రోల్ బంకు కూడలి, పొట్టి శ్రీరాములు కూడలి, పాత బస్టాండు ఏరియాలో 12 గంటలకే ఎండ వేడిమికి నిర్మానుషంగా మారుతున్నాయి. ఉదయం 10 గంటలనుండి భానుడు భగభగమంటున్నాడు. సాయంత్రం 6 గంటల వరకు ఎండ తీవ్రత తగ్గడం లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎండ తీవ్రతతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు ఎండ వేడిమికి ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎండలు అధికం కావడంతో ఎండా వేడిమి నుండి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాల వైపు పరుగులు తీస్తున్నారు. మజ్జిగ, చెరుకు రసం, లస్సి ,టెంకాయ నీళ్ల వంటి శీతల పానీయాలకు గిరాకీ పెరిగింది. పట్టణంలోని ప్రధాన కూడలిలో చెరుకు రసం, శీతల పానీయాల షాపులు కిటకిటలాడుతున్నాయి. కూలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీలకు డిమాండ్ పెరిగింది.

నిర్మానుశ్యంగా ఉన్న రోడ్లు

తల పానీయాలు తాగుతున్న ప్రజలు

కార్మికులకు తీవ్ర ఇబ్బందులు

ఎండ వేడిమికి గని కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మిరప కోతలు అధికంగా ఉండడంతో కూలీలు మండలంలోని పడమటి పల్లెల నుండి ఆటోలలో మిరప పండు కోయడానికి కూలీ పనికి వెళ్తున్నారు. ఉదయం 6 గంటలకు కూలీ పనికి వెళ్లి 12 గంటలకు పనిని ముగించుకుంటున్నారు. గని కార్మికుల అవస్తలువర్ణాతీతం పైన వేడిమి కింద బండలు కాలిపోతుండడంతో గని కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేయలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

- డాక్టర్ శివశంకరుడు, టంగుటూరు పిహెచ్‌సి వైద్యాధికారి

వేసవికాలంలో ఎండలో తీవ్రమైనందున వడదెబ్బ బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వడ దెబ్బ తగిలిన వారిలో 40 శాతం మంది మృతి చెందే అవకాశం ఉంది. వడదెబ్బకు గురైన వ్యక్తికి తక్షణమే వైద్య సేవలు అందిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రాకూడదు.

మతసామరస్యానికి నంద్యాల ప్రతీక

- ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో ముస్లిం సోదరులు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పలు ఈద్గాలలో వేలాదిమంది ముస్లిం సోదరులు పవిత్ర ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒకరికొకరు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాన్ సామూన్, నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల పట్టణం మతసామరస్య తకు ప్రతీకగా నిలిచిందని ఎమ్మెల్యే తెలిపారు. పవిత్ర ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదుల వద్ద , ఈద్గాల వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు. అలాగే మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను కల్పించారు.

పార్థనల్లో పాల్గొన్న భూమా బ్రహ్మానంద రెడ్డి

సమస్త మానవాళి సుఖశాంతులతో ఉండాలని నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు. నంద్యాల భీమవరం రోడ్డు నందు ఉన్న అల్ఫుర్కాన్ ఈద్గా నందు ఈద్ ప్రత్యేక ప్రార్థనలో బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

బిజెపిపై ప్రచార భేరి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రెండో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల, కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తోంది. సామాన్యులపై భారాలు పెంచుతూ నడ్డి విరుస్తోంది. వంట గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతం పెంచేసింది. దాని ఫలితంగా నిత్యావసర సరుకుల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. దీనిపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. బిజెపికి హటావో దేశ్‌కీ బచావో నినాదంలో ఈ నెల 14 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బిజెపి ప్రభుత్వ విధానాలను జోరుగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో, గ్రామాల్లో వామపక్ష నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కరపత్రాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. నంద్యాలలో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించారు. దేశాన్ని కాపాడుకోవాలంటే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార భేరి కార్యక్రమం ఈ నెల 30 వరకూ కొనసాగనుంది.

వెయ్యి దాటిన యువగళం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర కర్నూలు జిల్లా ఆదోనిలో వెయ్యి కిలోమీటర్ల మైలురాయిని చేరుకుంది. ఈ నెల 13న ఉమ్మడి కర్నూలు జిల్లాలోకి పాదయాత్ర ప్రవేశించింది. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలం, పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలం, ఆలూరు నియోజకవర్గంలోని దేవనకొండ, ఆస్పరి మీదుగా ఆదోని పట్టణం వరకూ పాదయాత్ర సాగింది. పాదయాత్రలో లోకేష్‌ను చూసేందుకు జనం పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.

మండుతున్న ఎండ : జిల్లాలో ఎండ మండుతోంది. మార్చి చివరి వారం నుంచి భానుడి భగభగలు తీవ్రమయ్యాయి. జిల్లాలో వేసవి తీవ్రత పెరిగింది. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమితో మధ్యాహ్నం నిప్పుల కొలిమిలా ఎండ తీవ్రత కనిపిస్తోంది. మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని జిల్లా వాసులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు.

అకాల వర్షానికి.. రైతన్నకు అపార నష్టం

తడిసిపోయిన మిర్చి

కప్పి ఉంచిన మిరప పంట పై నిల్వ ఉన్న నీరు

ప్రజాశక్తి - అవుకు

మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతన్నలకు ఆపార నష్టం జరిగింది. అవుకు, సింగన పల్లె, సంఘపట్నం, చెన్నంపల్లి, శివవరం, సుంకేసుల, కాశీపురం, మెట్టుపల్లి, రామవరం గ్రామాల్లో సాగుచేసిన వరి, మిరప పంటలకు తీవ్ర నష్టం వాటిలినిందని రైతులు పేర్కొంటున్నారు. రబి సీజన్లో సాగు చేసిన వరి పైరు గాలి వాన బీభత్సావానికి వరి పైరు పొలాల్లోనే నేల వాలింది. దీంతో పంటకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు పేర్కొంటున్నారు. అలాగే మండలంలో అధికంగా సాగు చేసిన పంటల్లో మిరప పంట ఒకటి మిరప పంటను కోతలు కోసి కల్లాల్లో రోడ్ల వెంట ఆరబోశారు. రైతులు వర్షం వస్తుందన్న సూచనతో మిరప పంటపై పట్టలను కప్పి ఉంచారు. మరికొందరు మిరప పొలాల్లోనే మిరప పంటను కోత దశలో ఉండ డంతో వర్షము కురవటంతో మిరప పంట తడిసి ముద్దయింది. ఇప్పటికే వ్యవసాయ కూలీ లతో సతమతమైన రైతులకు అకాల వర్షం కార ణంగా రైతులకు మరింత నష్టం వాటిల్లి పెను బారంగా మారిందని రైతులు వాపోయారు.

పొలాల్లో పడిపోయిన వరి పైరు

బిజెపిని గద్దెదించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని గద్దెదించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు అన్నారు. శనివారం మిడ్తూర్ మండల కేంద్రంలో సిపిఎం మండల కన్వీనర్ టి ఓబులేష్ అధ్యక్షతన సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు, సిపిఎం నాయకులు భాస్కర్ రెడ్డి, పి వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ మాట్లా డుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు అధికారం కోసం ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేస్తామని, రైతులు పండించిన పంట గిట్టుబాటు ధర కల్పిస్తామని, ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ధరలను అదుపులో పెడతామని, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాల అవుతున్న ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని అన్నారు. రైతుల పండించిన పంటను స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు అమలు చేసి రైతులకు రెట్టింపు ధర కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను పెట్టుబడుదారుల కనుగొనంగా మార్పు చేయడం జరుగుతుందని వారు ఆరోపించారు. వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని వాటికి భిన్నంగా నేడు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ప్రజల పైన విచ్చలివిడిగా పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్, విద్యుత్ చార్జీలు పెంచడం జీఎస్టీ పేరుతో విపరీతంగా పనులు వసూలు చేసి ప్రజలను బిజెపి దోపిడీ చేస్తుంద న్నారు. మిడుతూరు మండలానికి హంద్రినీవా ద్వారా సాగు, తాగునీరు అందిం చాలని వారి డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల అవుతున్న అలగనూ రు రిజర్వాయర్ గండి పూర్చకపోవడం విచారకరమని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళనలు చేపడతామని వారి హెచ్చ రించారు. కార్యక్రమంలో స్థానికులు సుజ్ఞానం, జయరాముడు, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. **తరువాయి 6లో..**

తరువాయి 6లో..

బేతంచెర్లలో..

వివరాలను తెలుసుకుంటున్న ఇఎన్‌సి నారాయణరెడ్డి

ఫాల్ట్ జోన్ పూర్తిచేసి నీటిని అందిస్తాం

- ఇఎన్‌సి నారాయణరెడ్డి

ప్రజాశక్తి -అవుకు

గాలేరు నగరి వరద కాలువ నిర్మాణంలో భాగంగా అవుకు వద్ద నిర్మిస్తున్న టన్నెల్ సొరంగ నిర్మాణ పనులను శనివారం ఇఎన్‌సి నారాయణరెడ్డి పరిశీలించారు. టన్నెల్ నిర్మాణానికి ఆటంకంగా ఉన్న ఫాల్ట్ జోన్ ప్రాంతములో స్వయంగా పరిశీలించి అక్కడి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన్నల్ లోపల 16ఎం వరకు ఫాల్ట్ జోన్ ప్రాంతము సమస్యగా తలెత్తిందని ఈ సమస్యను తొలగించేందుకు నిపుణులైన ఇంజనీర్లతో కొత్త కొత్త పరికరాలతో పనులను చేపడుతున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఫాల్ట్ జోన్ను అధిగమించి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. ఫాల్ట్ జోన్ ప్రాంతంలో నిర్మాణ పనులను వేగంగా పనులు జరిగేలా చర్యలు తీసుకొని మీ చివరి నాటికి పూర్తి పూర్తిచేసి జిఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా నీటిని తరలిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ వరప్రసాద్ టన్నల్ మేనేజర్ శ్రీహరి ఏఈలు, డిఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

వడగండ్ల వర్షం

ప్రజాశక్తి - పగిడ్యాల

భానుడు భగభగ మండుతున్నారు. ఉష్ణోగ్రత అత్యధికంగా పెరిగిపోవడంతో గ్రహమాలలో పట్టణాలలో ప్రజలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే శనివారం సాయంత్రం నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో, పగిడ్యాల మండల పరిధిలోని వడగండ్ల వర్షం పడడంతో కొద్దిసేపు వేడికి ఇలవేలాడిపోతున్న ప్రజలకు ఊరట లభించినట్టయింది. దాదాపు పది నిమిషాల వరకు ఈదురు గాలులు వడగండ్ల వర్షం కురవడంతో ఉష్ణోగ్రత వేడిలోడితో విలవిల్లాడిపోతున్న ప్రజలకు కొంత సేపు ఊరట లభించింది.

వడగండ్లను ఏరుకుంటున్న స్థానిక ప్రజలు

మెడికల్ కాలేజీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

- సుప్రీంకోర్టులో టిడిపి నేతలకు చుక్కెదురు
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల ప్రజల చిరకాల కోరికను ఎవ్వరు అడ్డుకోలేరని, మెడికల్ కళాశాల నిర్మణాన్ని అడ్డుకోవడానికి టిడిపి నేతలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైయ్యిందని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మెడికల్ కళాశాల, హాస్పిటల్ పురోగతిపై వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి. నంద్యాలకు మెడికల్ కళాశాల, హాస్పిటల్ నిర్మాణం కోసం రూ.475 కోట్లు నిధులను మంజూరు చేశారని, కళాశాల నిర్మాణానికి సంబంధించి స్థల సేకరణ చేపట్టేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు పలు చోట్ల స్థలం కోసం అన్వేషిస్తే మెడికల్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వానికి చెందిన 50ఎకరాల స్థలం ఎక్కడా లేక పోవడంతో స్థానిక ఆర్ఎఆర్ఎస్‌కు చెందిన స్థలాన్ని కళాశాల, హాస్పిటల్ నిర్మాణానికి ప్రతిపాదన చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో కేటాయించిన ప్రాంతంలో మెడికల్ కళాశాల, హాస్పిటల్ నిర్మాణం చేపట్టకూడదంటూ ప్రతిపక్ష నేతలు కుట్రలు పన్ని కోర్టులకు వెళ్లి అభివృద్ధిని అడ్డుకొనేందుకు ప్రయత్నాలు చేశారన్నారు. హైకోర్టు ధర్మాసనం వారి కేసులను కొట్టివేస్తూ నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే తదనుగుణంగా నిర్మాణం పనులు వేగవంతంగా నూతన సాంకేతిక విధానంలో చేపట్టడం జరుగిందన్నారు. టీడీపీ నేతలు ఎలాగైనా అభివృద్ధిని అడ్డుకోవాలని తాజాగా సుప్రీంకోర్టు మెట్లు ఎక్కడం, అక్కడా వారికి చుక్కెదురు అయ్యిందన్నారు. ఇది నంద్యాల ప్రజల విజయమన్నారు. నంద్యాల ప్రజల మంచికోసం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఆప్కో డైరెక్టర్ సుబ్బారాయుడు ,కౌన్సిలర్ మేష చంద్రశేఖర్, రమణ, సాయిరాం రెడ్డి ,రితీష్ రెడ్డి, గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

టిడిపిని వీడి 15 కుటుంబాలు వైసిపిలోకి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో అవుకు మండలం మంగంపేట తండాకు చెందిన 15 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో మంగంపేట తండా గ్రామానికి చెందిన పితావత్ గోవింద్, పితావత్ మల్లి నాయక్, పితావత్ రవి నాయక్, కుర్ర వెంకటరమణ నాయక్, శ్రీరామ్ నాయక్ ,వెంకటేష్ నాయక్, శంకర్ నాయక్, రాంల నాయక్, కిట్టు నాయక్, తులసి నాయక్‌లకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టిడిపిని వీడి వైసిపిలో చేరుతున్నట్లు తెలిపారు. గిరిజన గ్రామాల్లో వారికి ప్రభుత్వ భూముల పట్టాలు ఇప్పించి వారు సాగు చేసుకునేటట్లు చేపట్టడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంగంపేట తండా వైసిపి నాయకులు మద్దిలేటి నాయక్, తిరుపాల్ నాయక్, పరశురాం నాయక్, బీజా నాయక్ ,బాలు స్వామి నాయక్, బీజా మద్దిలేటి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీలో చేరుతున్న టిడిపి నాయకులు

మట్కా, గాంబ్లింగ్‌పై ప్రత్యేక దృష్టి

సూచనలు చేస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మట్కా, గాంబ్లింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ కే రఘువీర్ రెడ్డి పోలీసులను ఆదేశించారు. శనివారం నంద్యాల టౌన్‌లోని 3 టౌన్ పోలీసు స్టేషన్‌ను ఎస్పి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిసరాలను పరిశీలించి, శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్లో నిర్వహిస్తున్న కేసు డైరీ, వివిధ క్రైమ్ రికార్డ్సలను పరిశీలించారు. స్టేషన్లో పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్టేషన్‌లో సీజ్ చేయబడిన వాహనా లను, లాకప్ గదులను, కంప్యూటర్ గదిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రతి ఫిర్యాదు దారునితో మర్యాదగా వ్యవహరిస్తూ, సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. స్పెషల్ బ్రాంచ్ సిఐ దస్తగిరి బాబు, ఎస్పీ సీసీ నాగరాజు, 3 టౌన్ సిఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు

భక్తి శ్రద్ధలతో రంజాన్

ప్రజాశక్తి - ఆత్మకూర్

రంజాన్ పండుగను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని పలు మసీదులలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నంద్యాల టర్నింగ్ వద్ద ఉన్న పెద్దల సమాధులకు వారు సందర్శించి వారి జ్ఞాపకం చేసుకున్నారు. టర్నింగ్ వద్ద సిపిఎం, తెలుగుదేశం, వైఎస్ఆర్సిపి పార్టీలు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

సిపిఎం సీనియర్ నాయకులు ఏ రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్‌లు మాట్లాడుతూ ముస్లిం సోదరులు కఠోర దీక్షతో 30 రోజులపాటు ఉపవాసాలు ఉంటూ ఈ పండుగను ఘనంగా నిర్వహించు కుంటారన్నారు. కావున హిందూ ముస్లిం భాయిభాయి మతసామరస్యం వర్ధిల్లాలని వారు అన్నారు. సిపిఎం నాయకులు పి సుధాకర్, మాబాష,ఎన్ స్వాములు, ఏ సురేంద్ర,డి రామ్ నాయక్,వీరన్న, కలిముల్లా, బి.ఎస్ వలి,చాంద్,భాస్కర్,మహమ్మద్,గోవిందు తదితరులు పాల్గొన్నారు. **తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో** జరిగే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, తదితరులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు అందించారు.

వైయస్సార్ శిబిరం వద్ద ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, శిల్పా కార్తీక్ రెడ్డి, శిల్పా భువనేశ్వర్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్, పలువురు కౌన్సిలర్లు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు అందజేశారు. **ఆళ్లగడ్డ:** ఆళ్లగడ్డ పట్టణములో, మండలంలోని గ్రామాలలో ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి ర్యాలీగా మసీదుల నుంచి, దివ్యజ్ఞాన మందిరం నుంచి లింగందిన్నె రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు చేరుకొని ప్రత్యేక నమాజు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు సాదిక్ హుస్సేన్ రంజాన్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ జీవన్ గంగనాథ్ బాబు నేతత్వంలో ఎస్సై వెంకట్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు. **బనగానపల్లె:** మండలంలో రంజాన్ పండుగ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం రంజాన్ పవిత్ర ఉపవాసాల మాసం ముగింపు రోజు పట్టణంలోని ఈద్గా మైదానంలో ఈద్ ఉల్ ఫితర్ పండుగను సందర్భంగా ముస్లిం సోదరులు వేలాదిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలో వేలాదిమంది ముస్లింలు పాల్గొని రంజాన్ పండుగ పవిత్రతను చాటి చెప్పారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో, కొండపేట అవుకు రోడ్డులోని ఎస్ఆర్బిసి కాలనీ సమీపంలోనే ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలలో మత గురువులు మత పెద్దలు, ముత్తువలిలు రంజాన్ పండుగ ప్రాముఖ్యత గురించి, విశిష్టత గురించి బోధించారు. ముస్లిం సోదరులు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

తరువాయి 6లో..

ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్, సిపిఎం నాయకులు

ఆళ్లగడ్డ: ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

బిజెపిని గద్దెదించాలి : సిపిఎం

5వపేజీ తరువాయి..

బేతంచెర్ల: ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ దేశాన్ని అధోగాతపాలు చేస్తున్న మోడీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి గద్దె దింపాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఆర్.ఈశ్వరయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వైబి. వెంకటేశ్వర్లు,పార్టీ సీనియర్ నాయకులు వై.ఎల్లయ్యలు అన్నారు. శనివారం స్థానిక పట్టణంలోని పాతపేట,శ్రీనగర్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ,బనగానపల్లె రైల్వేగేట్లు,సంజీవనగర్,హనుమాన్ నగర్, రిజిస్టర్ ఆఫీస్ లైన్ ఏరియాలలో ప్రచార భేరి పాదయాత్ర కొనసాగించారు. ఈ ప్రచార బేరి పాదయాత్ర సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సభ్యులు పి.వెంకటరమణ, కె.రాజబాబు,ల అధ్యక్షతన రెండు దళాలుగా ఏర్పడి కరపత్రాల పంపిణీ కార్యక్రమం మూడవ రోజు నిర్వహించారు. అనంతరం అర్.ఈశ్వరయ్య, వైబి. వెంకటేశ్వర్లు, వై.ఎల్లయ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శిలు కే రాజబాబు, చిన్న నరసింహులు నాగరాజు, నాయకులు చిన్న వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, చిన్నబి, అంకాలు, పెద్ద నరసింహులు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ విగ్రహం చుట్టూ పిచ్చి మొక్కలు తీసివేస్తున్న నాయకులు

రాజీవ్ గాంధీ విగ్రహానికి మెరుగులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు తుది మెరుగులు దిద్దారు. నంద్యాల పట్టణంలోని పున్నాపురం కాలనీలోని రాజీవ్ గాంధీ విగ్రహం చుట్టు పిచ్చి మొక్కలతో శనివారం కాంగ్రెస్ పార్టీ పిసిసి రాష్ట్ర కార్యదర్శి చింతల మోహన్ రావు నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, పిసిసి అధికార ప్రతినిధి ఊకొట్టు వాసు, జిల్లా కోశాధికారి ఎస్ వై డి ప్రసాద్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్, ఎస్సీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కరాటే బాలకృష్ణ, చాబోలి సలాం వెళ్లి ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించారు. మే 21న రాజీవ్ గాంధీ వర్ధంతికి విగ్రహాన్ని కొత్త రంగులు వేయించి పరిసర ప్రాంతాలు అన్నిటిని కూడా శుభ్రంగా చేయాలని నిర్ణయించారు. డాక్టర్ చింతల మోహన్ రావు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో ఒకే ఒక రాజీవ్ గాంధీ విగ్రహం ఉండటం వలన ఆ విగ్రహానికి పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టి వెలుగులోకి తీసుకురావాలన్నారు. ప్రజా సంక్షేమం కొరకు ప్రజా శ్రేయస్సు కొరకు పాటుపడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని నంద్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య తెలిపారు.

కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు

పిడుగు పడి ముగ్గురికి అస్వస్థత

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని శివవరం గ్రామంలో శుక్రవారం రాత్రి పిడుగుపడటంతో ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలోని సూర్యనారాయణ స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడిందని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనలో దూరంగా ఇంటి దగ్గర ఉన్న ముగ్గురు అస్వస్థకు గురికావ డం జరిగిందని స్థానికులు తెలిపారు. వీరిలో గుంతనాల మధును చికిత్స నిమిత్తం నంద్యాలకు తీసుకెళ్లినట్లు తెలిపారు. సూర్యనారాయణ స్వామి ఆలయం వద్ద పిడుగు పడటంతో గ్రామంలోని ప్రజలందరూ భయభ్రాంతులకు గురైనట్లు తెలిపారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -ప్యాపిలి

మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ఈడిగ రాజన్న (62) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించాడు. ఆయన మృతికి డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు ఎ.వి.భాస్కర్ రెడ్డి,టి.శివరాం సంతాపం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం ఏనుగుమర్రి గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్న వారు మృతుని భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజన్న యూనియన్ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొని యూనియన్ అభివృద్ధికి పాటుపడేవాడని కొనియాడారు. ఆయన అకాల మరణం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. మృతునికి భార్య నారాయణమ్మ, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి యూనియన్ అన్ని విధాల అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. అంత్యక్రియల్లో ఏనుగుమర్రి గ్రామానికి చెందిన డ్రైవర్లు రామాంజ నేయులు, సర్వేశ్వరయ్య,పుల్లయ్య,రవి, బాలకృష్ణ,మురళి, రంగస్వామి, ఏనుగుమర్రి సర్పంచ్ కరణం మోహన్, కరణం నాగరాజు,బావిపల్లి లారీ ఓనర్ చంద్రన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గా ఏర్పాటు చేసిన కర్ర స్థంబాలు

ప్రమాదకరంగా రక్షకభట నిలయం

ప్రజాశక్తి - చాగలమర్రి

ఎంతో చరిత్ర కల్గిన అత్యంత పురాతన పోలీస్ స్టేషన్ నేడు ప్రమాద కర స్థితికి చేరుకుంది. బ్రిటీష్ వారి కాలంలో ట్రెజరీగా ఉన్నటు వంటి భవనం నేటి ప్రస్తుత పోలీస్ స్టేషన్ శిథిలావస్థకు చేరుకుంది. చాగలమర్రిలోని పోలీస్ స్టేషన్ ప్రమాదకర పరిస్థితిలో ఉంది. ఇది బ్రిటిష్ కాలం నాటి నిర్మాణం. చెక్క దంతెలతో వేసిన మిద్దె కావడంతో ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా తయారైంది. దంతెలపై కప్పు ఉన్నప్పటికీ ప్రస్తుతం స్టేషన్ ఆవర ణలో చెక్క దంతెలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అంతే కాకుండా పె చ్చులు ఊడి పడుతుండటంతో బిక్కుబిక్కుమంటూ పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సిబ్బంది కూలకుండా అడ్డుగా కర్ర స్థంబా లు ఏర్పాటు చేశారు. స్టేషన్లో విధులు నిర్వహించే సిబ్బంది, స్టేషన్‌కు వచ్చే ప్రజలు ఇలా ప్రమాదకర పరిస్థితిని చూసి భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బనగానపల్లె సిఐగా మల్లికార్జున గుప్తా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -బనగానపల్లె

బనగానపల్లె సిఐగా మల్లికార్జున గుప్తా పదవీ బాధ్యతలు స్వీకరిం చారు. శనివారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో సిఐగా మల్లికార్జున గుప్తా పదవి బాధ్యతలు స్వీకరించారు. బనగానపల్లె సిఐగా పనిచేస్తున్న సుబ్బరాయుడుని అనంతపురం రేంజ్‌కు విఆర్‌కు వెళ్లారు. నంద్యాల విఆర్ లో ఉన్న మల్లికార్జున గుప్తాను బనగానపల్లె సిఐగా నియమించారు. దీంతో సిఐగా పదవి బాధ్యతలు స్వీకరించారు.

ఇద్దరు ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

బనగానపల్లెలో ఇద్దరు ఎస్ఐలు బాధ్యతలు స్వీకరించారు. శనివారం బనగానపల్లె ఎస్సైలుగా నవీన్ బాబు, వీరాంజనేయులు పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న రామిరెడ్డి మెడికల్ లీవ్ పెట్టడం, ఇక్కడ మరో ఎస్సైగా పనిచేస్తున్న శంకర్ నాయక్ బేతంచర్లకు బదిలీ కావడంతో నంద్యాల నుండి నవీన్ బాబు, వీరాంజనేయులు బనగానపల్లె ఎస్సైలుగా బదిలీపై వచ్చారు. వీరు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

చంద్రబాబు కాన్వాయ్‌పై రాళ్ల దాడి దుర్మార్గం

ప్రజాశక్తి - పాములపాడు

ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన రోడ్ షోలో కాన్వాయ్‌పై వైసిపి మంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో కొంతమంది నాయకులు రాళ్ల దాడికి పాల్పడడం దుర్మార్గమని మండల తెలుగు యువత అధ్యక్షులు మధు కృష్ణ అన్నారు. శనివారం ఆయన పాములపాడులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ మంత్రులు దిగజారి ఇలాంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరగడం, అపూర్వ స్పందన లభిస్తునడంతో ఓర్వలేని వైసిపి నాయకులు రోడ్డు షోలను, బహిరంగ సభలను అడ్డుకునేందుకు ప్రజలను భయభ్రాంతులను గురి చేసేందుకు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నా రని అన్నారు. ఇప్పటికైనా వైసీపీ బుద్ధి తెచ్చుకొని ఇలాంటి చర్యలు మానుకోవాలని లేకపోతే తెలుగుయువత ఆధ్వర్యంలో నిరసన కార్యక్ర మాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు హఫీజ్బాష, ఉస్మాన్ బాషా, మహీంద్ర, నరేష్, యతీరజులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-డోన్

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కె. రంగనాయకులు అన్నారు. మార్క్సిస్టు మహో పాధ్యా యుడు లెనిన్ జయంతిని పురస్కరించుకొని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని డోన్ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, సుత్తి, కొడవలి జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రంగనాయకులు మాట్లాడుతూ దేశంలో మతం ముసుగులో పాసిస్టు పాలన కొనసాగుతుందన్నారు. ప్రజల పైన నిత్యం దాడులు కొనసాగుతున్నాయన్నారు. ప్రజా సంపదను నిలువునా కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారన్నారు. ప్రభుత్వాలు పాలకులు, కార్పొరేట్ శక్తుల చేతిలో కీలుబొమ్మల్లా మారి దేశ సంపదను కొల్లగొడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు రఘు,మధు,విద్యార్థులు రజిని తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కె. రంగనాయకులు

ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు : ఎఐటియుసి

ప్రజాశక్తి - బనగానపల్లె

ఉద్యోగులు, ఏపీఎన్జీవో, అమరావతి జేఏసీ ఆందోళనకు ఏఐటి యుసి సంపూర్ణ మద్దతు ఉంటుందని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి శివ బాలకృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలోని ఏఐటియుసి కార్యాలయంలో బాలకృష్ణ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే సామూహిక ధర్నాకు ఏఐటీయూసీ అనుబంధ ప్రజా సంఘాల మద్దతు ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని, సిపిఎస్ రద్దు చేస్తానని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తా నని ఉద్యోగులకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. ఆప్కాస్ విధానం వల్ల ఎన్నడూ లేని విధంగా కార్మికుల తీవ్రత ఇబ్బందు లకు గురవుతున్నారని, పిఎఫ్ ,ఈఎస్ఐ కోసం తప్పనిసరిగా విజయవాడ వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారని, అందుబాటులో ఉండే కార్యాల యంలో పనులు జరగడం లేదని తెలిపారు. ఆప్కాస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 25 జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సామూహిక ధర్నా, 29 సచివాలయాలు వద్ద ఆందోళనలకు ఉద్యోగులు తలపెట్టిన ఉద్యమానికి ఏఐటియుసి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో రవి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్

జాబ్ మేళాలో విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని కేవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహిం చిన జాబ్ నెలలో 91 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళా కు 230 విద్యార్థులు హాజరయ్యారన్నారు. అందులో టెక్ మహీంద్రా కంపెనీలో 49 మంది, హెటిరో కంపెనీలో 42 మంది విద్యార్థులకు జాబ్ రావడం జరిగిందని ప్రిన్సిపల్ తెలియజేశారు. జాబ్‌కి ఎంపిక అయిన వారికి ఆఫర్ లెటర్స్ అందజేసి విద్యార్థులను అభినందించారు.

నంద్యాల విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణానికి చెందిన న్యాయవాది పాణ్యం విజయ భాస్కర్ రెడ్డి కుమార్తె మీనాక్షి బంగారు పతకం సాధించింది. పాణ్యం భాస్కర్ రెడ్డి, రాణిల కుమార్తె మీనాక్షి రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ పట్టణంలోని మాళవ నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ చదువుతోంది. 2022 సంవత్సరంలో ఫైనల్ ఇయర్‌లో అత్యధిక మార్కులు సాధించడంతో ప్రతిష్టాత్మకమైన బంగారు పతకం అందుకుంది. మీనాక్షికి లోక్సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు ప్రముఖుల సమక్షంలో బంగారు పతకాన్ని అందజేశారు. కళాశాల నిర్వహించిన 16వ శతకోత్సవ కార్యక్రమం వేడుకల్లో మీనాక్షికి బంగారు పతకం అందుకోవడంతో పలువురు అభినందనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీనాక్షి తల్లిదండ్రులు పాణ్యం విజయ భాస్కర్ రెడ్డి, రాణిలు మాట్లాడుతూ తమ కుమార్తె మీనాక్షి బంగారు పతకం అందుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. బంగారు పతకం సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు.

గుండెపోటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని చిన్నరాజుపాలెం గ్రామానికి చెందిన పోతుగంటి గోవింద్ గారి సతీమణి లక్ష్మీదేవి(46)గుండెపోటుతో మృతి చెందారు. శనివారం విషయం తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా లక్ష్మీదేవి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. బీసీ ఇందిరా వెంట టిడిపి ఎస్టీ సెల్ నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు కృష్ణా నాయక్ ,టిడిపి బీసీ సెల్ నంద్యాల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, టిడిపి నాయకులు చిన్న రాజుపాలెం నరసింహులు, రామాంజనేయులు ఉన్నారు.

ఓంకారంలో తహాశీల్దార్ దంపతులు

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

నల్లమల అటవీ ప్రాంతంలో శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి వారి వెలసిన ఓంకార క్షేత్రంలో తహసిల్దార్ ఉమారాణి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి క్షేత్రానికి చేరుకోగానే ఆలయ చైర్మన్ విశ్వనాధ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అధికారులతో కలిసి అర్చకులు చక్రపాణి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో వారిని శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

మద్దిలేటి స్వామి ఆలయం చేరుకున్న ధ్వజస్తంభం

ప్రజాశక్తి - బేతంచర్ల

మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 58 అడుగుల ధ్వజస్తంభమును ఆర్ఎస్ రంగాపురం గ్రామం నుండి ట్రాక్టర్‌పై ఊరేగింపుగా శనివారం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

- ఎంపీపీ బుగ్గన నాగభూషణం, చైర్మన్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచర్ల

40 రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాస దినాలు పాటిస్తూ నిన్నటి దినం నెలవంక కల్పించడంతో, నేడు ముస్లింల పవిత్రమైన పండుగ రంజాన్ జరుపుకుంటున్న ముస్లిం అందరికీ ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా బేతంచెర్ల మండల కేంద్రంలోని వైయస్సార్ పార్టీ కార్యాలయం నందు ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు మూర్తి జావలి, కాజా,కోడే వెంకటేశ్వర్లు, మధు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

దానానికి ప్రతీక రంజాన్ : బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

దానానికి ప్రతిక రంజాన్ పండుగనే మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. పట్టణంలోని ముస్లిం మైనార్టీ సోదరులు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం నాయకులు అన్వర్ సాహెబ్, అల్తాఫ్ హుస్సేన్ ,టిప్ టాప్ కలాం, కూరగాయల మహబూబ్ బాషా, హర్షద్, అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

24న పోలీసు స్పందన రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 24వ తేదిన జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు స్పందన కార్యక్రమమును తాత్కలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు సుదూర ప్రాం తాల నుండి వ్యయ, ప్రయాసలతో (బొమ్మలసత్రం దగ్గర) జిల్లా పోలీసు కార్యాలయంలోని జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమానికి రావొద్దని తెలిపా రు. అన్ని స్థానిక పోలీసు స్టేషన్‌ల యందు, డిఎస్పి కార్యాలయాలలో పోలీసు స్పందన కార్యాక్రమం జరుగుతుందన్నారు. వచ్చే సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు స్పందన యధావిధిగా కొనసాగు తుందని జిల్లా ఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 1 అంగన్వాడీ కార్యకర్త, 5 అంగన్వాడి సహాయకురాలకు సంబంధించిన పోస్టుల భర్తీ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఓ లీలావతి శనివారం పత్రికా ప్రకటనలో కోరారు. మే ఒకటో తేదీ నాటికి స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని సిడిపిఓ తెలిపారు. 21 సంవత్సరం నుండి 35 సంవత్సరాల్లోపు ఉన్నవారు ఈ పోస్టులకు అర్హులని ఆమె తెలిపారు. అంగన్వాడి వర్కర్ చేసుకునేవారు పదవ తరగతి పాసై ఉండాలని, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు ఏడవ తరగతి పాసై ఉండాలన్నారు.

మహిళలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న మౌలానా ముస్తాక్ అహ్మద్

200 కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రంజాన్ పండుగ సందర్భంగా తెలుగుదేశం మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ శనివారం 200 కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగలో భారతదేశంలో మత సామరస్యం వెల్లివిరుస్తుందన్నారు. ఇఫ్తార్ విందులలో ముస్లింలతో పాటు ఇతర మతస్తులు పాల్గొనడం భారతదేశంలోనే చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రషీద్,ఖాజా ఫారిద్,ఖాజా హెహఫీజ్,ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణానికి చెందిన శ్రీరామ మోహన కృష్ణ జన్మదినం సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం పట్టణంలోని ఆస్థానం సమీపంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా ప్రారంభించి, మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరా మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా కేకులు కట్ చేసి పార్టీలు ఇచ్చి ధనాన్ని వృధా చేయకుండా మంచి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ డైరెక్టర్ గుండా సుప్రజా, వైస్ గవర్నర్ శ్రీ రామ వెంకట సుబ్రహ్మణ్యం ,ప్రెసిడెంట్ బచ్చు రమేష్ ,కార్యదర్శి పరుచూరి సత్యం, ట్రెజరర్ ఆర్కే సత్యం, ఆర్యవైశ్య సంఘం నాయకులు నూకల వెంకటసుబ్బయ్య, దమ్మాల వెంకటసుబ్బయ్య, గాదంశెట్టి వేణుగోపాల్, జక్కా నాగరాజు, గుండా రవికుమార్, కృషి విజ్ఞాన కేంద్రం ఏవో సురేష్, యాగంటి దేవస్థానం పాలకమండలి సభ్యులు బింగిమళ్ళ హనుమాన్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరా

భక్తి శ్రద్ధలతో రంజాన్

ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

రుద్రవరం మండలంలో..

శుభాకాంక్షలు తెలిపి బుడ్డా రాజశేఖర్ రెడ్డి

5వపేజీ తరువాయి..

పగిడ్యాల: మండలంలో రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. నెహ్రు నగర్, ముచ్చు మర్రి, ఆంజనేయ నగర్, బీరవోలు, సంకిరేణి పల్లె, పగిడ్యాల, లక్ష్మాపురం, ప్రాతకోట, గణపురం గ్రామాలలోని సోదరులు ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ప్రార్థన అనంతరం ఒకరిని ఒకరు అలింగణం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. **అవుకు:** మండలంలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. అవుకు జలాశయం వద్ద ఉన్న నవాజ్ కొండపై ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని ముస్లిం మత పెద్దల సమక్షంలో ప్రార్థనలను నిర్వహించారు. ప్రార్థనల అనంతరము దానధర్మాలను నిర్వహించారు. **మహానంది:** మండలంలో రంజాన్ సందర్భంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో నమాజ్ చేశారు. అనంతరం ముస్లిం సోదరులందరూ ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **పాములపాడు:** మండల కేంద్రంలో, గ్రామాలలో ముస్లిం మైనార్టీ సోదరులు గత 30 రోజులుగా ఉపవాసాలు ఉంటూ భక్తిశ్రద్ధలతో రంజాన్ మాసాన్ని పూర్తి చేసుకొని శనివారం రంజాన్ పండగ సందర్భంగా ముస్లింలు కొత్త దుస్తులు ధరించి ఈద్గాల దగ్గరికి వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం ఆలింగనము చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **సంజామల :** మండలంలో రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **ప్యాపిలి:** ప్యాపిలి పట్టణం, మండలంలోని గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగ వేడుకలు జరుపుకున్నారు. ఈద్గాల వద్దకు చేరుకొని ప్రార్ధనలు నిర్వహించారు. మత గురువు మహబూబ్ ఖాన్ మాట్లాడుతూ ఖురాన్ గ్రంథం సారంసాన్ని వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **రుద్రవరం:** మండలంలో రంజాన్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలింగనం చేసుకుని రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **చాగలమర్రి :** మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు శనివారం జరిపారు. ఆయా గ్రామాలలోని మసీదులు,ఈద్గాలలో ప్రత్యేక ప్రార్ధనలు జరిపారు. చాగలమర్రి పట్టణం లోని అడ్డవాగు సమీపంలో ఈద్గా వద్ద ప్రభుత్వ ఖాజీ యూనస్ ఆధ్వర్యం లో భక్తి సందేశం ఇచ్చారు. అనంతరం రంజాన్ విశిష్టతను వివరించారు. ప్రార్థనల అనంతరం ముస్లీం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుం టూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా వద్ద ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

పాములపాడులో..

పగిడ్యాలలో..

ప్యాపిలిలో..

మహారాజశ్రీ ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

S.O.P. No. 1/2023

1. షేక్ జంషీద్ అహమ్మద్, S/o. Late S. జహంగీర్
2. పక్కిర్ సాబు గారి జరీన, D/o. Late S. జహంగీర్
3. షేక్ ఖాజాఖ్రముద్దీన్, S/o. Late S. జహంగీర్
4. యు. ఫతిమూన్, D/o. Late S. జహంగీర్

All are Muslims, R/o. ఆత్మకూరు టౌన్, నంద్యాల జిల్లా. .... అర్జీదారు

V/s

నిల్ .... రెస్పాండెంట్

జనరల్ నోటీసు

పై నెంబరు అర్జీలో పై అర్జీదార్లు తమ తండ్రి గారైన షేక్ జహంగీర్, S/o. షేక్ అబ్దుల్ అజీజ్, ఆత్మకూరు గ్రామ కాపురస్తులు చనిపోయినందున ఆయన వారసులుగా ప్రకటించమని మరియు అతనికిరావలసిన పి.పి.ఓ./20172 (Roc) సోమ్మును అసిస్టెంట్ కమీషనరు (P.F) కడప వారి నుండి రాబట్టుకొనుటకు పై కోర్టులో పై అర్జీని దాఖలు చేసినారు. కనుక యాన్మంది ప్రజలకు ఈ పత్రికా నోటీసు ద్వారా తెలియజేయడం ఏమనగా పై అర్జీలో ఎవరికైనా, ఏమైనా ఆక్షేపణలు ఉన్నఎడల 27-04-2023 తేది ఉదయం గం|| 10-30 ని||లకు పై కోర్టులో మీరు స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెయును. లేనిచో మీ పరోక్షమున పై అర్జీనీ తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 27-04-2023

ఇట్లు
వేముల వెంకటేశ్వర్లు
అర్జీదార్ల న్యాయవాది,
ఆత్మకూరు, నంద్యాల జిల్లా.